క్లుప్తంగా

గట్టు తిమ్మప్పస్వామికి ప్రత్యేక పూజలు



శాంతినగర్: తనగల సమీపంలోని గట్టుపై వెలసిన శ్రీ తిమ్మప్పస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొందరు దాసంగాలు పెట్టగా, మరికొందరు స్వామి వారికి ప్రత్యేక నైవేద్యాలు, పూలు, పండ్లు, కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గట్టు తిమ్మప్ప ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలపించిన తిమ్మప్ప, గోవిందనామస్మరణ గట్టుపై మార్మోగింది.

వైభవంగా ప్రభోత్సవం



గట్టు: మండలంలోని బల్గెరలో నిర్వహిస్తున్న శ్రీ దిగంబరస్వామి ప్రభోత్సవాన్ని శనివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. బల్గెర దిగంబర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగిస్తూ, ఆలయానికి తీసుకొచ్చారు. పూజల అనంతరం రాత్రి ఉత్సవమూర్తిని ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. బల్గెర, మాచర్ల గ్రామస్తులతో పాటుగా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి, ప్రభోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాసు శ్యామల, ఎంపీటీసీ రూపవతి, మాజీ సర్పంచు హనుమంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



అయిజ: మండలంలోని పులికల్ గ్రామం వద్ద ఎక్సైజ్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం తలమర్రి గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కనికవీడుకు మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 24 కార్టన్ల మద్యం బాటిళ్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో గద్వాల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గణపతిరెడ్డి, ఎస్ఐ వీరేశలింగం, సిబ్బంది వేణు, శేఖర్, నాయుడు, చందర్, మహేష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఎర్రవల్లిచౌరస్తా: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన డాకేశ్వర్‌రెడ్డి (35) కొంతకాలంగా కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా గొడవ జరగడంతో మనస్తాపానికి గురై రాత్రి ఇంట్లో అందరూ పడుకున్నాక రేకుల షెడ్డులోని పైపునకు ఉరేసుకుని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోదరుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తప్పనిసరి

మానవపాడు: ప్రజలకు వడదెబ్బ తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతేనే బయటకు వెళ్లాలని డాక్టర్ రిజ్వాన్ తాన్వీర్ సూచించారు. శనివారం మండలంలోని అమరవాయి, పెద్దఆముదాలపాడు, నారాయణపురం గ్రామాలలో వ్యాక్సిన్‌ను పరిశీలించి వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండి వేడిగాలులు వీచడం పెరుగుతుందని, వడదెబ్బ తగులకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైనా వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి శరీరాన్ని చల్లని నీటిలో తడిపిన గుడ్డతో తూడవాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం తాగాలని సూచించారు. తల నొప్పి, అలసట, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఉండవెల్లి: మండల కేంద్రంలో సెంట్రింగ్ పని చేస్తున్న మద్దిలేటి గుండెనొప్పితో మృతి చెందగా, అంత్యక్రియలకు సెంట్రింగ్ యూనియన్ సభ్యులు రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, మదు, కృష్ణ, శివ, తదితరులు ఉన్నారు.

గ్రామీణ రోడ్ల అనుసంధానమేదీ?

- మారుమూల గ్రామాల నుంచి ఇతర గ్రామాలకు బీటీ రోడ్లు కరువు
- పక్కపక్కనే గ్రామాలున్నా రవాణా సౌకర్యం లేక అవస్థలు
- రవాణా ఖర్చులతో పాటు సమయం వృథా
- రహదారులు నిర్మించి ఇబ్బందులు తొలగించాలంటున్న ప్రజలు



కోయిల్‌దిన్నె–జిల్లెడుదిన్నె మధ్య రవాణా సౌకర్యంలేని మట్టి రోడ్డు

శాంతినగర్: దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలు. గ్రామాలు బాగుపడితేనే దేశం బాగుంటుందని చెబుతుంటారు తరచుగా సమావేశాల్లో ప్రజాప్రతినిధులు. ఎన్నికల సమయంలో చేసిన వ్యాఖ్యలు, ఎన్నికలవగానే మరవడం ప్రజాప్రతినిధులకు పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా ఉన్నాయని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా, ప్రతిపాదనలు పంపించాం, నిధులు మంజూరైన వెంటనే పనులు చేయిస్తామని చెప్పడం సర్వసాధారణంమైంది. వడ్డేపల్లి మండలంలోని మారుమూల గ్రామాలకు ఇతర గ్రామాల నుంచి రవాణా సౌకర్యం కొరవడింది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లాలంటే కాలినడక తప్ప మరో దారిలేదు. ఆర్థికంగా బాగున్న వారు మోటార్ సైకిళ్లపై, కార్లలో దూరంలో ఉన్న బీటీ రహదారుల గుండా దూరమైన ప్రయాణిస్తుంటారు. పేదలకు అటు బస్సు సౌకర్యం లేక, ఇటు ప్రైవేట్ ఆటోలు అందుబాటులో లేక సతమతమవుతున్నారు. మారుమూల గ్రామాల ప్రజల ఇబ్బందులను అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించి ఆయా గ్రామాలను కలుపుతూ అనుసంధానంగా దశాబ్దాల క్రితం ఉన్న నక్స బాటలను రహదారులుగా మార్చి రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నక్సబాటల పరిస్థితి ఇలా..

వడ్డేపల్లి మండల పరిధిలోని కోయిల్‌దిన్నె, జిల్లెడుదిన్నె గ్రామాలకు వెళ్లాలంటే నక్సబాటలో రెండు కిలోమీటర్లు ఉంటుంది. అదే బీటీ రహదారిపై గ్రామానికి చేరుకోవాలంటే శాంతినగర్ మీదుగా ఆరు కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. మండలంలోని కొంకల–వడ్డేపల్లి గ్రామాలకు వెళ్లాలంటే అడ్డదారిలో నక్సబాట ఉంటుంది. ఆ దారిలో వడ్డేపల్లికి చేరుకోవాలంటే కేవలం రెండు కిలోమీటర్లు ఎడ్లబండ్లపై, మోటార్‌సైకిళ్లపై వెళ్లవచ్చు. అదే కార్లు, బస్సుల్లో వెళ్లాలంటే జూలెకల్ స్టేజీ మీదుగా శాంతినగర్ నుంచి వడ్డేపల్లికి 9 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది.

కనుమరుగవుతున్న రహదారులు

ఆయా గ్రామాలను అనుసంధానం చేస్తూ పూర్వం పెద్దలు ముందు ఆలోచనతో 20 నుంచి 33 ఫీట్ల నక్స రోడ్లు ఏర్పాటు చేశారు. గ్రామాల మధ్య రాకపోకలు పెరగాలని, ప్రజలకు ఒక గ్రామంతో మరొక గ్రామానికి సంబంధ బాంధవ్యాలు మెరుగుపడాలని బండ్ల బాటలు పొలల్లో వదిలారు. ప్రస్తుతం ప్రధాన గ్రామాలను కలపడానికి బీటీ రహదారులు నిర్మించడం, పాత రస్తాలను పట్టించుకోకపోవడంతో దారులు మూసుకుపోయాయి. ఎడ్ల బండ్లు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

కబ్జా అవుతున్న బాటలు

ఆయా గ్రామాలకు వెళ్లడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన నక్స రోడ్లు కొన్ని చోట్ల కబ్జాలకు గురయ్యాయి. దీంతో దారిలేక కిలోమీటర్ల మేర ఎక్కువ ప్రయాణించి గమ్యాలకు చేరుకోవాల్సి వస్తోంది. ఒకరి పొలం నుంచి మరొకరి పొలానికి, అదేవిధంగా ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి ఏర్పాటు చేసిన రహదారులు కొంతమంది రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. ఆర్డీఎస్, నెట్టెంపాడు కాల్వలకు ఇరువైపుల దారులు ఏర్పాటు చేయడంతో పాత రస్తాలను కబ్జా చేసుకుని కాల్వల వెంట వెళ్లమని రైతులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి ఆయా గ్రామాలకు గతంలో ఏర్పాటు చేసిన నక్సా బాటలను పునరుద్ధరించి ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

శాంతినగర్ మీదుగా వెళ్లాలి



మా ఊరు నుంచి కోయిల్‌దిన్నెకు మూడు కిలోమీటర్లు ఉంటుంది. పాత నక్స రస్తా వెంట వెళ్తే దగ్గరవుతుంది. నక్స రస్తాను బాగు చేయకపోవడంతో మట్టి రోడ్డు గుంతలమయమై ప్రయాణానికి నరకంగా మారింది. శాంతినగర్ మీదుగా వెళ్తే 8 కిలోమీటర్లు అవుతుంది. బాట బాగు చేయించి రవాణా సౌకర్యం కల్పించాలి.

– వెంకటేశ్వర్‌రెడ్డి, కోయిల్‌దిన్నె

వడ్డేపల్లికి వెళ్లాలంటే దూరం..



మా ఊరు నుంచి వడ్డేపల్లికి వెళ్లాలంటే జూలెకల్ స్టేజీ శాంతినగర్ మీదుగా వెళ్లాలి. కొంకల నుంచి వడ్డేపల్లి నక్సా రోడ్డు పూర్వం నుంచి ఉంది. రోడ్డును బాగు చేయకపోవడంతో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు తప్ప ఇతర వాహనాలకు సౌకర్యం లేదు. రోడ్డు బాగాలేనందున ఆటోలు తిరగవు. మూడు కిలోమీటర్లు ఉన్న వడ్డేపల్లికి 8 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

– నరేష్, కొంకల, వడ్డేపల్లి మండలం

సౌకర్యం లేకుంటేనే ప్రతిపాదనలు

ఆయా గ్రామాలకు దూరం నుంచైనా బీటీ సౌకర్యం ఉంటే ప్రతిపాదనలు పెట్టడానికి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా అవకాశం ఉండదు. ఇతర గ్రామాల నుంచి అసలు రోడ్డు సౌకర్యం లేకుంటేనే నిధులు మంజూరవుతాయి. కోయిల్‌దిన్నె–జిల్లెడుదిన్నె, కొంకల–వడ్డేపల్లి రోడ్లకు ప్రతిపాదనలు పంపలేదు. ఎవరైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని మంజూరు చేయిస్తే తప్ప ప్రతిపాదనలు పంపడానికి మాకు అవకాశం ఉండదు.

– లక్ష్మీనారాయణరెడ్డి, ఏఈ, పంచాయతీరాజ్‌శాఖ

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మనోరమ

కేటీదొడ్డి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మనోరమ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య, ఇతర సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా ప్రజలకు తాగునీటి సమస్య ఉండకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ఏదైనా సమస్యలుంటే గ్రామ ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు నాయక్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఏఓ మహలక్ష్మి, ఏపీఓ అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

నిందితులు నోటీసులు అందుకోవాలి



పోలీస్ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

ఎర్రవల్లిచౌరస్తా: ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ శిక్షలు పడే నేరస్తులు పోలీస్ వారు అందించే 41(ఎ) సీఆర్ పీసీ నోటీసులు అందుకోవాలని అలంపూర్ వలయాధికారి రవిబాబు అన్నారు. శనివారం ఎర్రవల్లి మండల కేంద్రంలో ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీస్ చట్టాలతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ హాజరై ప్రజలకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలకార్మిక వ్యవస్థ, మైనర్ బాలికలను వేధిస్తే నిందితులకు పడే పోక్సో చట్టం, ఆపదలో ఉపయోగపడే 100డయల్, పోలీస్ చట్టాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 7ఏళ్లు అంతకంటే తక్కువ శిక్ష పడే ఐపీసీ కేసులలో, స్పెషల్ లా కేసులలో సుప్రీం కోర్టు గైడ్‌లెన్స్ ప్రకారం మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చకుండానే పోలీస్‌స్టేషన్‌ల అధికారుల ద్వారా నిందితులకు 41(ఎ) సీఆర్ పీసీ ద్వారా నోటీసులు అందజేస్తారని తెలిపారు. వాటిని నిందితులు తప్పకుండా తీసుకోవాలన్నారు. నోటీసులు అందుకున్న నిందితులు అందులో పొందపర్చిన సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

గద్వాల క్రైం: చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని పట్టణ, రూరల్ ఎస్ఐలు పర్వతాలు, శ్రీనివాసులు అన్నారు. గద్వాల మండలంలోని పూడూరు, పట్టణంలోని దౌదర్‌పల్లిలో ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ పరిధిలో శిక్ష పడే కేసుల్లో నిందితులుగా ఉన్న వారు 41/ఎ నోటీసులు అందుకోవాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో దొంగతనాలు, హత్యలు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గద్వాల అర్బన్: విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ప్రియదర్శి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఫైనల్ ఇయర్ విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని వదిలేసి, ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. డిగ్రీ పూర్తయినా తర్వాత యూనివర్సిటీలో మంచి ర్యాంకులు సాధించి మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 22024–25 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్స్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీడీసీ మెంబర్ సాయిశ్యామ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

‘చిల్లర రాజకీయాలు మానుకోవాలి’



ఎర్రవల్లిచౌరస్తా: ఆర్ఎస్పీకి చేతనైతే ప్రజాక్షేత్రంలో పోరాడాలి కానీ చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా శనివారం ఇటిక్యాల మండల కేంద్రంలో బీఎస్పీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గెలుపునకు పరోక్షంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మద్దతు ఇస్తున్నారని మండిపడ్డారు. నాగర్‌కర్నూల్ బీఎస్పీ అభ్యర్థి బీసమొల్లా యేసేపు నామినేషన్‌ను తిరస్కరణ చేయడం కోసం చివరి నిమిషం వరకు ఆర్ఎస్పీ, ఆయన అనుచరులు తీవ్రంగా ప్రయత్నించారని విమర్శించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కంటే ఎక్కువ నియంతలా ఆర్ఎస్పీ వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజాక్షేత్రంలో ఆర్ఎస్పీకి పోరాడే దమ్ములేక బీఎస్పీపై భౌతిక దాడులు చేస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో నాయ కులు బీసన్న, రంజిత్ కుమార్, శంకర్, రంగన్న, హనోక్, నల్లన్న, పెంటన్న, ఏసన్న, కృష్ణయ్య, నర్సింహులు ఉన్నారు.

కార్మికుల జీవితాలతో చెలగాటం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

గద్వాల అర్బన్: కార్మికులతో జీవితాలతో చెలగాటమాడి, ప్రశ్నించిన కార్మిక వర్గాన్ని అణచివేసి, నిరంకుశంగా వ్యవహరిస్తున్న బీజేపీ, దాని మిత్ర పక్ష పార్టీలను ఓడించాలని, లౌకిక కూటమి ఇండియా కూటమిని గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికలు–కార్మికవర్గ కర్తవ్యం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేశారన్నారు. 44కార్మికచట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికుల ప్రయోజనాలను కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కేంద్ర ప్రభుత్వ స్కీం వర్కర్లకు, ఉద్యోగభద్రత, కనీస వేతనాలు పెంచకుండా శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికవర్గం కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా బీజేపీ, దాని మిత్రపక్షలను ఓడించి లౌకిక కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ, ఉపాధ్యక్షుడు ఉప్పేరు నర్సింహ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్టన్న, పట్టణ అధ్యక్షుడు రంగన్న, రామకృష్ణ, సుధాకర్, తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: మతాల మధ్య చిచ్చుపెట్టి ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు చేస్తున్న బీజేపీని ఓడించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని హమాలీ కార్మిక అడ్డ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని 138వ మేడే వేడుకలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు మేడేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నారాయణ, రాజు, వెంకట్రాములు, సత్యం, సురేష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లికి చెందిన తెలుగు వెంకటేష్ (54) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయన కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్ఐ పేర్కొన్నాడు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఈనెల 29న ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న సమస్యలపై సమావేశంలో చర్చించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

అయిజ: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ వేడుకలు నిర్వహించి పార్టీ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అయిజలో సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



తనగలలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగలలో బీజేపీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం, మోదీ చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఆంజనేయులు, హరికృష్ణ, బూత్ కో ఆర్డినేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మిట్టదొడ్డిలో బీజేపీ నాయకులు ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరిహర రెడ్డి, నాగరాజుశెట్టి, నర్సింహులు, శీను పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీ వీరాపురం, ఆర్ గార్లపాడు గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, మహేంద్రనాయుడు, గోవర్ధన్, రాజు, తదితరులు ఉన్నారు.

ప్రచారం విజయవంతం చేయండి

గద్వాల రూరల్: ఈనెల 28, 29వ తేదీలలో బీజేపీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నారని, ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం డీకే బంగ్లాలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపోలింగ్ బూత్ నుంచి అధ్యక్షులు, కో–ఆర్డినేటర్లు, బీఎల్ఏలు ముగ్గురు చొప్పున ఆయా ప్రాంతాల పరిధిలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాష, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, బలిగెర శివారెడ్డి, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



ఉండవెల్లిలో ర్యాలీలో పాల్గొన్న మహిళలు



గట్టులో మాట్లాడుతున్న ఏపీడీ నర్సింగరావు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని మండల అధికారులు ఎంపీఓ పద్మావ తి నిర్వహించారు. ఎంపీఓ మాట్లాడుతూ ఓటు నమోదుపై ప్రత్యేక ర్యాలీ నిర్వహించి, మహిళలు, వృద్ధులు, యువకులు, ఓటును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

గట్టు: ఓటర్లు తమ ఓటు హక్కును నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని ఏపీడీ నర్సింగరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అంతకు ముందు అధికారులు, మహిళా సంఘం సభ్యులు కలిసి గ్రా మంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీడీ నర్సింగరావు మాట్లాడారు. ఓటర్లు ఎలాంటి ప్ర లోభాలకు లొంగకుండా, మతాలకు, విందులకు ప్రభావితం కాకుండా స్వేచ్ఛగా నచ్చిన వ్యక్తికి ఓటు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యకళ, గ్రా మ సంఘం అధ్యక్షురాలు శ్రీదేవి గుప్త, ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఎం సాంబశివుడు, సీసీ జ్యోతి, వీఓఏలు సురేష్, వీరేష్‌లు పాల్గొన్నారు.

మానవపాడు: భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కుని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా డీపీఎం విలాస్‌రావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునే విధంగా మహిళా సంఘాలు అవగాహన కల్పించాలన్నారు. ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో ముందుకు..!

- కిడ్నీల పనితీరుపై పరిశోధన..
- డాక్టరేట్ పొందిన రంగస్వామి



గట్టు: ఓపెన్ టెన్త్‌లో ఫెయిల్ అయి, రెండవ ప్రయత్నంలో పాసైన వ్యక్తి ఏకంగా డాక్టరేట్‌ను పొంది అందరి దృష్టిని ఆకర్షించాడు పెంచికలపాడు గ్రామానికి చెందిన రంగస్వామి. శుక్రవారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పెంచికలపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన రంగస్వామి కిడ్నీల పనితీరుపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ను పొందాడు. ఫ్యాకల్టీ ఆఫ్ మెడిసిన్ (బయో కెమిస్ట్రీ) విభాగంలో చెన్నైలోని మీనాక్షి అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో కిడ్నీలపై పరిశోధన చేయడంతో రంగస్వామికి డాక్టర్‌ను ప్రదానం చేశారు. 2007–10గాను మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీలో ఎంఎస్సీ మెడికల్ బయో కెమిస్ట్రీ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించాడు. పెంచికలపాడుకు చెందిన రంగన్న కుమారుడు రంగస్వామి అప్పట్లో గ్రామంలో కేవలం 5వ తరగతి వరకు మాత్రమే చదివేందుకు అవకాశం ఉండగా, అక్కడి వరకే చదివి మానేశాడు. 9 ఏళ్ల తర్వాత 2000లో ఒపెన్ టెన్త్ పరీక్ష రాయగా, అందులో ఫెయిల్ అయ్యాడు. 2001లో మళ్లీ ఓపెన్ టెన్త్ పరీక్షలకు హాజరై థర్డ్ క్లాస్‌లో పాసయ్యాడు. 2001–03 వరకు ఇంటర్ మహబూబ్‌నగర్‌లో పూర్తి చేయగా, బీఎస్సీ ఎంఎల్‌టీని హైదరాబాద్‌లో 2003–06లో పూర్తి చేశాడు. తన చదువు మధ్యలో ఆగి పోయినప్పుడు అన్న నాగరాజు తనను ప్రోత్సహించాడు. ఈ స్థాయికి చేరుకునేందుకు నిత్యం తన వెంటే ఉండి ప్రోత్సహించాడు. కిడ్నీలు దశల వారీగా పని చేస్తూ, దెబ్బతింటుంటాయని, వాటిని మనం సకాలంలో గుర్తించి, వాటి పని తీరును మెరుగు పరుచుకుంటే జీవిత కాలాన్ని మరికొంత వరకు పొడిగించుకునే అకాశం ఉంది. గుండెకు కిడ్నీకు లింకు ఉంటుంది. కిడ్నీ ఫెయిలూర్ అయితే గుండె పోటుతో చనిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీనిపై పరిశోధనలకు డాక్టరేట్ లభించినట్లు రంగస్వామి తెలిపారు. పెంచికలపాడు వాసికి డాక్టరేట్ రావడంపై మాజీ ఎంపీటీసీ తాయమ్మ, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.